క్లుప్తంగా

ఐద్వా ఆవిర్భావ వేడుకలు



జెండావిష్కరణ చేస్తున్న అలివేలు

కర్నూలు(సెంట్రల్): ఐద్వా ఆవిర్భావ వేడుకలను వాడవాడలా నిర్వహించారు. స్థానిక ఇందిరాగాంధీ నగర్‌లో ఎం.కుమారి అధ్యక్షతన, చైతన్య నగర్‌లో శంకరమ్మ అధ్యక్షతన, వీకర్‌సెక్షన్ కాలనీలో ఎస్.శ్యామల అధ్యక్షతన రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.నిర్మల, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అరుణ, అలివేలు జెండావిష్కరణలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు గడిచినా మహిళలకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం మహిళా సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేయడం లేదన్నారు.

'హలో మాల.. చలో తిరుపతి' పోస్టర్ విడుదల



పోస్టర్ విడుదల చేస్తున్న మాల సంఘం నాయకులు

కర్నూలు (అర్బన్): ఈ నెల 23వ తేదీన తిరుపతిలో జరిగే రాయలసీమ మాలల సింహ గర్జన సభకు మాలలు అత్యధికంగా తరలివచ్చి జయప్రదం చేయాలని మాల సంఘం గౌరవాధ్యక్షులు సి.అశోకరత్నం కోరారు. ఆయన సంఘం నాయకులతో కలసి బుధవారం నగరంలోని పాతబస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద.. తిరుపతి సభ పోస్టర్‌ను విడుదల చేశారు. జేఏసీ కన్వీనర్ యాట ఓబులేసు, సీనియర్ లీడర్ మాధవస్వామి, లింగస్వామి, న్యాయవాది బంగి సుధీర్, నరసప్ప, జయరాముడు, సౌందర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడి నియామకం



నియమక పత్రాన్ని అందుకుంటున్న బోయ మహేంద్రనాయుడు

కర్నూలు(సెంట్రల్): యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా బోయ మహేంద్రనాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన యూత్ కాంగ్రెస్ ఏపీ ఇన్‌చార్జ్ మమతారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు లక్కరామారావు చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. తన నియమకానికి సహకారం అందించిన మాజీ ఎమ్మెల్సీ సుధాకరబాబు, నంద్యాల జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్, కర్నూలు నగర పార్టీ అధ్యక్షుడు జిలానీ బాషాకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో యూత్ కాంగ్రెస్ వైపు నడిచేలా తనవంతు కృషి చేస్తానని, పార్టీలోని పెద్దలు తనకు సహకారం అందించాలని కోరారు.


ఇఫ్తార్ విందులో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు (టౌన్): నగరంలోని పెద్దమార్కెట్ వద్ద ఉన్న మస్జిద్-ఏ-జులేఖని మసీదులో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక నాయకులు సిరాజ్ ఆహ్వానం మేరకు ఆయన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్వీ మాట్లాడుతూ.. ప్రపంచ మానవాళికి అల్లాహ్ శాంతి సందేశం ఇచ్చారని, అలాగే చెడుపై యుద్ధం ప్రకటించారన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్, మైనార్టీ నాయకులు పత్తా బాషా, నగర అధ్యక్షులు వస్తాద్, సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సారాతో జీవితం నాశనం



మాట్లాడుతున్న హనుమంతరావు

వెల్దుర్తి: నాటుసారా తయారీ, అమ్మకంతో జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కర్నూలు జిల్లా అసిస్టెంట్ కమిషనర్ రావిపాటి హనుమంతరావు అన్నారు. బుధవారం ఎస్‌టీఎఫ్ ఏసీ సుధాకర్ రెడ్డి, సూపరింటెండెంట్ సుధీర్‌బాబుతో కలిసి కోడుమూరు ఎక్సైజ్ శాఖ పరిధిలోని వెల్దుర్తి, పుల్లగుమ్మి గ్రామాల్లో నవోదయం కార్యక్రమం నిర్వహించారు. నాటుసారా తయారీ, అమ్మకంతో వల్ల జరిగే నష్టాలను వివరించారు. మానుకున్న వారికి జీవనాధారం కల్పిస్తామని హామీనిచ్చారు. మానని వారిపై చట్టపరమైన చర్యలు, పీడీ యాక్టు ప్రయోగానికి సైతం వెనుకాడబోమని హెచ్చరించారు. ఆయా కార్యక్రమాల్లో సీఐ మంజుల, తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, ఎంపీడీఓ సుహాసిని, జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న, ఏఎస్ఐ బాలకృష్ణ పాల్గొన్నారు.

ఇవేనా మెరిసే రోడ్లు?

- సంక్రాంతి అన్నారు.. శివరాత్రి కూడా పోయింది
- అయినా మరమ్మతులకు నోచుకోని రోడ్లు
- గుంతలమయంగా మారిన రహదారులు
- అధ్వానంగా అర్బన్ కాలనీ రోడ్లు
- అవస్థలు పడుతున్న ప్రజలు



కల్లూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాయకులు గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లను సంక్రాంతికల్లా బాగు చేస్తామని ఊదరగొట్టారు. ఇప్పుడు శివరాత్రి కూడా పోయి రెండు వారాలవుతోంది. కనీసం రోడ్లపై గుంతలను కూడా పూడ్చలేకపోవడంతో వాహనదారుల, ప్రయాణికుల అవస్థల సంగతి అటుంచితే, రోడ్లు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి.

కల్లూరు అర్బన్, కర్నూలు నగరంతో పాటు 52 వార్డుల్లో సుమారు 6.5 లక్షల మంది జనాభా ఉన్నారు. కల్లూరు అర్బన్‌లో 16 వార్డులో ఉండగా, అర్బన్ ప్రాంతం రోజురోజుకు విస్తరిస్తోంది. కాలనీలలో మౌలిక వసతులు మాత్రం కల్పించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

రోడ్లన్నీ గుంతలమయం

రోడ్లన్నీ గుంతలమయంగా మారడంతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు నగర శివారులోని జొహరాపురం నుంచి ఇందిరమ్మ కాలనీకి వెళ్లే రహదారి అడుగడుగునా గుంతలు పడి ఉండటంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఈ రహదారి వెంట రోజు వందల సంఖ్యలో వాహనాలు ఇందిరమ్మ కాలనీ, బీడీ వర్కర్స్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, వెంకాయపల్లె, గార్గేయపురం వెళ్తుంటాయి. అయితే రోడ్డు గుంతలమయంగా ఉండడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కింద పడిన సంఘటనలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రోడ్లు బాగు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు దాటినా రోడ్లు వేయలేదని వాహనదారులు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మొత్తం దెబ్బతినడంతో ఎదురుగా ఎదైనా వాహనం వస్తే భయం భయంగా ప్రయాణించాల్సి వస్తోంది.

➤ అలాగే జొహరాపురం నుంచి నాల్గవ తరగతి కాలనీ వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రోడ్డులో రాంప్రియ నగర్, యాగంటీశ్వరనగర్ తదితర కాలనీలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ఆయా కాలనీలకు చెందిన ప్రజలు కోరుతున్నారు.

➤ 44వ నంబరు జాతీయ రహదారి నుంచి 28వ వార్డు లక్ష్మీపురం గ్రామానికి సుమారు రెండు కిలోమిటర్ల దూరం ఉంది. అయితే రోడ్డు మొత్తం గుంతలమయంగా మారింది. ఈ దారిలోనే కేజీబీవీ విద్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉన్నాయి. కేజీబీవీ విద్యాలయం ముందు గుంతలు ఏర్పాడాయి. ఈ రోడ్డుపై లక్ష్మీపురం, దొడ్డిపాడు గ్రామాలకు చెందిన ప్రజలు. కళాశాల విద్యార్థులు, వ్యవసాయ కూలీలు నిత్యం తిరుగుతుంటారు. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



దెబ్బతిన్న లక్ష్మీపురం రోడ్డు

పడితే అంతే సంగతులు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని గార్గేయపురం నుంచి దిగువపాడు గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై భారీ గుంతలు ఏర్పడటంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ పరిధిలోని ఈ రోడ్డుపై హంద్రీ – నీవా కాలువ బ్రిడ్జి సమీపాన గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులు పొరపాటున అదుపుతప్పి పడితే అంతే సంగతులు. దిగువపాడు మీదుగా మిడుతూరు మండల కేంద్రానికి నిత్యం వందలాది వాహనాలు ప్రయణిస్తుంటాయి. ఈ రోడ్డు గుంతలమయంగా మారడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రివేళ ప్రయాణం నరకప్రాయంగా ఉంటోందని, ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేయాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.



గార్గేయపురం నుంచి దిగువపాడుకు వెళ్లే రోడ్డుపై ప్రమాదకరంగా గుంతలు

రోడ్లను బాగు చేయండి



జొహరాపురం నుంచి వెంకాయపల్లె వరకు దెబ్బతిన్న రోడ్డును బాగు చేయాలి. ఈ దారిలో ఇందిరమ్మ కాలనీ, బీడీ వర్కర్స్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, మజుందార్ నగర్, మణికంఠ హోమ్స్, వెంకాయపల్లె, పుల్లయ్య కళాశాలకు ప్రజలు, విద్యార్థులు నిత్యం ప్రయాణిస్తుంటారు. అలాగే కర్నూలు, నందికొట్కూరు మండలాలకు చెందిన గ్రామాల నుంచి కర్నూలు నగరంలోని పాతబస్టాండ్, ఆస్పత్రులకు, కళాశాలకు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు అధ్వానంగా ఉండటంతో చాలా మంది ప్రమాదాలకు గురై ఆస్పత్రుల పాలై ఆర్థికంగా నష్టపోతున్నారు. రోడ్డు వేయడంతో పాటు ఇరువైపులా కాలువలు నిర్మించాలి. – ఎం.విజయ రామాంజనేయులు,సీపీఎం నగర కార్యవర్గ సభ్యుడు

ప్రజల ఇబ్బందులు తొలగించాలి



జొహరాపురం నుంచి నాల్గవ తరగతి కాలనీకి వెళ్లే రోడ్డు మొత్తం గుంతలు పడి అధ్వానంగా మారింది. రోడ్డును నిర్మించి ప్రజల ఇబ్బందులు తొలగించాలి. ఈ రోడ్డుపై నిత్యం రాంప్రియనగర్, యాగంటీశ్వరనగర్, నాల్గవ తరగతి కాలనీలతో పాటు ఇతర కాలనీలకు చెందిన వారు ప్రయాణిస్తుంటారు. రాత్రి సమయంలో రాకపోకలు సాగించాలంటే వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలి.
– సి.ఇంద్రభవాణి, నాల్గవ తరగతి కాలనీ

నేడు అష్టావధానం

కర్నూలు కల్చరల్: మండల పరిధిలోని మిలటరీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉదయం 10 గంటలకు వర్ధమాన అవధాని డాక్టర్ బోరెల్లి హర్షచే అష్టావధాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు సి.రాజేశ్వరమ్మ తెలిపారు. అవదానం సుధాకర్ శర్మ, మారేడు రాముడు, తొగట సురేశ్, చంద్రమౌళిని, వరలక్ష్మి, యర్ర మ పాండురంగయ్య, దేవ వరం, శ్రీనివాసులు, రాఘవయ్య పృచ్ఛకులుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. కర్నూలు డివిజన్ ఉప విద్యాధికారి హనుమంతరావు ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు వెల్లడించారు.

సింహ వాహనంపై శ్రీరంగనాథుడి విహారం



మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో శ్రీరంగనాథుని వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పల్లకీలో ఆలయ ప్రదక్షిణ చేశారు. రాత్రి స్వామివారు సింహ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వీరయ్య పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కోడుమూరు రూరల్: కోడుమూరులోని మోడల్ స్కూల్లో 2025–26 సంవత్సరానికిగాను ఇంటర్ మొదటి సంవత్సరానికి సంబంధించి ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశాల కోసం పదో తరగతి పూర్తయిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఆశాజ్యోతి బుధవారం తెలిపారు. ఈనెల 17వ తేదీ నుంచి మే 22వ తేదీ లోగా నిర్ణయించిన రుసుం చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, పదిలో వచ్చిన మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలియజేశారు.

గ్లకోమాపై అవగాహన



ర్యాలీ చేస్తున్న మైపర్ కాలేజీ విద్యార్థులు

కర్నూలు సిటీ: మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీ (మైపర్)లో బుధవారం గ్లకోమాపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. మోడరన్ ఐ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ జి.అనిల్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గ్లకోమా గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. దీని తీవ్రత ఎక్కువైతే కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉంటుందన్నారు. గ్లకోమా ఉందని చాలా మందికి తెలియదని, 90 శాతం మందికి ఆ వ్యాధి ఉందనే విషయం తెలియదని అన్నారు. ప్రాథమిక దశలో ఆ వ్యాధి లక్షణాలు కనిపించవని, దీని గురించి తెలుసుకుంటే కొంత ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. అనంతరం గ్లకోమాపై అవగాహనకు నగరంలోని పలు కాలనీల్లో ర్యాలీ చేపట్టారు. ప్రిన్సిపాల్ మహాలక్ష్మీ, వైస్ ప్రిన్సిపాల్ కాకర్ల సురేష్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

రోబోటిక్ పద్ధతిలో మోకీలు మార్పిడి



ఆపరేషన్ చేయించుకున్న సత్యప్రకాష్‌తో డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): రోబోటిక్ పద్ధతిలో మోకీలు మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు శ్రీ సాయిసత్య హాస్పిటల్ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ వై.హరిప్రసాద్‌రెడ్డి చెప్పారు. తక్కువ సమయంలో 19 మందికి రోబోటిక్ విధానంలో మోకీలు మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతం అయిన నేపథ్యంలో బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 9న కర్నూలు సమీపంలోని బి.తాండ్రపాడుకు చెందిన ఏపీఎస్‌పీడీసీఎల్ రిటైర్డ్ ఉద్యోగి సత్యప్రకాష్ (68)కు రోబోటిక్ విధానంలో మోకీలు మార్పిడి చికిత్స చేశామన్నారు. మరుసటి రోజే ఆయన లేచి నిలబడి నడవగలుగుతున్నాడని తెలిపారు. అడ్వాన్స్‌డ్ రోబోటిక్ మోకీలు మార్పిడి శస్త్రచికిత్సలో ఆపరేషన్ మరింత కచ్చితత్వంగా ఉంటుందన్నారు. సాధారణంగా చేసే మోకీలు ఆపరేషన్ కన్నా చిన్న కోతతో, అరుగుదల ఎక్కడుందో దాన్ని మాత్రమే సరిచేసే వీలుందన్నారు. ఆపరేషన్ తర్వాత నొప్పి కూడా పెద్దగా ఉండదన్నారు. రెగ్యులర్‌గా చేసే మోకీలు ఆపరేషన్లలో వేసే కృత్రిమ కీలు 15 నుంచి 20 సంవత్సరాలు మన్నిక వస్తే రోబోటిక్ విధానంలో వేసే కీలు జీవిత కాలం మన్నిక వస్తుందన్నారు. ఇప్పటివరకు ఆపరేషన్లు చేయించుకున్న వారందరూ చక్కగా వారి పనులు చేసుకోగలుగుతున్నట్లు తెలిపారు.

సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలి

కర్నూలు(సెంట్రల్): గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా నిర్వహిస్తున్న వర్క్ ఫ్రం హోం, ఎంఎస్ఎంఈ, పీ–4 సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం ఆయా అంశాలపై టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లతో సమీక్ష నిర్వహించారు. వర్కు ఫ్రం హోం సర్వేకు సంబంధించి కర్నూలు అర్బన్‌లో 1.30 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అలాగే కౌతాళం, హోళగుంద, తుగ్గలి, పెద్దకడబూరు మండలాలు కూడా సర్వేలో వెనుకబడి ఉన్నాయని, వేగవంతం చేయాలని సూచించారు. ఎంఎస్ఎంఈ సర్వేకు సంబంధించి పత్తికొండ, మద్దికెర, కర్నూలు అర్బన్, హాలహర్వి, చిప్పగిరి, గూడూరు, ఆలూరు, ఆదోని మునిసిపాలిటీలు 100 శాతం పూర్తిచేసినట్లు చెప్పారు. అలాగే కౌతాళం, గోనెగొండ్ల మండలాల్లో ఎంఎస్ఎంఈ సర్వే వెనుకబడి ఉందని, నాలుగు నెలల నుంచి చెబుతున్నా నిర్లక్ష్యంతో ఉన్నారని ఎంపీడీఓలపై చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ నాసర రెడ్డిని ఆదేశించారు. జిల్లాలో పీ–4 సర్వే 98 శాతం పూర్తైందని, బాగా పనిచేశారని ఎంపీడీఓలను అభినందించారు. ఇందులో కూడా కౌతాళం మండలం వెనుకబడి ఉందని చెప్పారు. సిటిజన్ ఈ–కేవైసీలో జిల్లా చాలా వెనుకబడి ఉందని త్వరగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను చిత్తశుద్ధితో పరిష్కరించాలని ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జేసీ డాక్టర్ బి.నవ్య, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్): స్థానిక పాతబస్తీలో ఉన్న పిలీ మసీదులో 8వ వార్డు వైఎస్సార్‌సీపీకి చెందిన నాయకుల ఆహ్వానం మేరకు కర్నూలు మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయరాదు



అవగాహన పోస్టర్లను విడుదల చేస్తున్న జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు

కోడుమూరు రూరల్: బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయరాదని జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు సూచించారు. మండలంలోని వర్కూరులో సంచార వైద్య చికిత్స కార్యక్రమాన్ని ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనేక అనర్థాలకు దారితీసే ధూమపానానికి ప్రజలు వీలైనంత దూరంగా ఉండాలన్నారు. ధూమపానం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్, జీర్ణశయ క్యాన్సర్, కడుపులో అల్సర్లు వంటి ప్రమాదకర జబ్బులు సోకే ప్రమాదముందన్నారు. అనంతరం వైద్య సిబ్బందితో కలిసి ధూమపాన రహిత దినోత్సవ పోస్టర్లను విడుదల చేశారు. కోలోకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మదన్‌శేఖర్, ఎంపీహెచ్‌ఈఓ నరసప్ప, హెల్త్ సూపర్‌వైజర్ కమాల్‌సాహెబ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ధరణి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సేవలు ప్రశంసనీయం

కర్నూలు(అగ్రికల్చర్): హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతాదారులకు విశేషమైన సేవలు అందిస్తోందని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ తెలిపారు. బుధవారం కర్నూలు కొత్త బస్టాండు సమీపంలో హెచ్‌డీఎఫ్‌సీ నూతన శాఖను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. బ్యాంకు అధికారు లు విజయమోహన్‌రెడ్డి, శశాంక్, సుందరం, వేణుగోపాల్‌రెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్లడ్ బ్యాంకుల తనిఖీ

కర్నూలు (హాస్పిటల్): కర్నూలులోని పలు బ్లడ్ బ్యాంకులను బుధవారం అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ తనిఖీ చేశారు. ముందుగా రాజ్‌విహార్ సెంటర్‌లోని కేర్ బ్లడ్ బ్యాంకుకు వెళ్లారు. అక్కడ స్టాఫ్ ఎవరూ లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం ల్యాబ్ టెక్నీషియన్ ఒక్కరితోనే బ్లడ్ బ్యాంకు నిర్వహించడం, రికార్డులు సరిగా నిర్వహించకపోవడంపై మండిపడ్డారు. వారంలోగా సరైన సంజాయిషీ ఇవ్వకపోతే బ్లడ్ బ్యాంక్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం అక్షయ, విశ్వభారతి, న్యూలైఫ్ బ్లడ్ బ్యాంకులను ఆయన తనిఖీ చేశారు. అక్కడి సిబ్బంది వివరాలు, రక్త సేకరణ, రక్త నిల్వల వివరాలను సేకరించారు. జిల్లాలో మొత్తం 13 బ్లడ్ బ్యాంకులు ఉన్నాయని, వీటన్నింటినీ అంచెల వారీగా తనిఖీ చేయనున్నట్లు ఆయన చెప్పారు.

వాహనాల వేలం ద్వారా రూ.5.77 లక్షల ఆదాయం

కర్నూలు: వివిధ ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాలను కర్నూలు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం వేలం వేశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు, సీఐ చంద్రహాస్ ఆధ్వర్యంలో 24 వాహనాలను వేలం వేయగా పలువురు పోటీపడి 17 వాహనాలను కొనుగోలు చేశారు. తద్వారా ప్రభుత్వానికి రూ.5.77 లక్షల ఆదాయం సమకూరింది. 18 శాతం జీఎస్టీతో కలిపి నగదు చెల్లించిన వారికి వాహనాలను అందజేశారు. మిగిలిన మరో ఏడు వాహనాలను తేదీ ప్రకటించి మరోసారి వేలం వేయనున్నట్లు సీఐ తెలిపారు.

14 నుంచి ఉరుసు మహోత్సవాలు

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లు, కాల్వ గ్రామాల్లో ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు ఉరుసు మహోత్సవాలు నిర్వహించనున్నట్లు దర్గా పీఠాధిపతులు ఎస్ఎండీ మహబూబ్ అల్లా షా ఖాద్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయా గ్రామాల్లో వెలసిన హజరత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ షా ఖాద్రి, హజరత్ సయ్యద్ గౌస్ మొహియ్యద్దీన్ షా ఖాద్రి స్వాముల వారి ఉరుసు సందర్భంగా మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా 14న గంధం, 15న ఉరుసు, 16న జియారత్(పూజలు)కిస్తీ ఉంటాయన్నారు.

మహిళా చట్టాలను అమలు చేయాలి

కల్లూరు: మహిళా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం నాయకురాలు ధనలక్ష్మి, సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు సుధాకరప్ప కోరారు. బుధవారం కల్లూరు అర్బన్ ముజఫర్‌నగర్‌లోని టీసీ లక్ష్మమ్మ కుట్టు మిషన్ సెంటర్ వద్ద మహిళా సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి దేవర



బోనాలతో ఊరేగింపుగా వెళుతున్న భక్తులు

నందనపల్లెలో వెలసిన పెద్దమ్మవారు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని నందనపల్లె గ్రామంలో బుధవారం పెద్దమ్మ తల్లి దేవరను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. 9 సంవత్సరాల అనంతరం జరిగే గ్రామ దేవరను అత్యంత వైభవంగా జరుపుకున్నారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో బోనాలను తలపై పెట్టుకొని డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి బోనాలను సమర్పించి పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో నందనపల్లె గ్రామం బంధుమిత్రులతో కిటకిటలాడింది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తాలుకా అర్బన్ పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీధర్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

అక్రమ మద్యం ధ్వంసం



వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యంను ధ్వంసం చేయిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామకృష్ణ రెడ్డి

కోసిగి: కోసిగి, కౌతాళం మండలాలలోని అక్రమంగా పట్టుబడిన కర్ణాటక, ఆంధ్ర మద్యం బాటిళ్లను జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి ఆదేశాల మేరకు ధ్వంసం చేశారు. బుధవారం కోసిగి వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామకృష్ణ రెడ్డి సమక్షంలో కోసిగి ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి, సివిల్ ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో పట్టుబడిన మద్యం బాటిళ్లను ట్రాక్టర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. వారు మాట్లాడుతూ కోసిగి సివిల్, ఎక్సైజ్, కౌతాళం సివిల్ స్టేషన్ల పరిధిలో గత ఏడాది ఆగస్టు నెల నుంచి డిసెంబర్ వరకు 105 కేసులలో 2,442 లీటర్లు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. వాటి విలువ సుమారు రూ.12,76,600 ఉంటుందన్నారు. ఇందులో కోసిగి ఎక్సైజ్ సీఐ కార్తీక్ సాగర్, కోసిగి, కౌతాళం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో పందుల స్వైరవిహారం

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పందుల స్వైరవిహారం అధికమైంది. ఆసుపత్రి ఆవరణలో ఎక్కడ చూసినా మందలు మందలుగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా శుశ్రుత భవన్, దీని వెనుక భాగం, సూపర్ స్పెషాలిటీ విభాగం, దాని పక్కనున్న ఖాళీ స్థలం, పాత గైనిక్ విభాగం, ఎంసీహెచ్ భవనం, పీజీ, హౌస్‌సర్జన్స్ క్వార్టర్స్, దిశ వన్‌స్టాప్ సెంటర్, టీబీ సెంటర్, సీఎల్‌జీ పక్కన అధికంగా సంచరిస్తున్నాయి. ప్రధానంగా రోగులు, వారి సహాయకులు అల్పాహారం, భోజనం తెచ్చుకుని తింటుండగా వారిపైకి వస్తున్నాయి. పందులు పడుకున్న స్థలం పక్కనే రోగులు, వారి సహాయకులు భోజనం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఏన్నో ఏళ్లుగా నెలకొన్న పందుల సమస్యను పరిష్కరించే అధికారులే కరువయ్యారు.
– కర్నూలు(హాస్పిటల్)



సూపర్ స్పెషాలిటీ భవనం వద్ద పందుల ఆవాసం